సిరియల్

బొమ్మిడి అచ్చారావు

(గత సంచిక తరువాయి)

సౌమ్య గింజుకొన్నది ఏమాత్రం అవకాశం దొరికినా వాళ్ళ దగ్గరున్న ఈటెల్లో దేన్నయినా దొరకబుచ్చుకొని ఆత్మహత్య చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది! కాని వాళ్ళమెకా అవకాశం యివ్వలేదు.

దూరంగా యేవో దీపాలు వెలుగుతున్నట్టు గుర్తించింది సౌమ్య. ఆటవికులు దాన్లో కొన్ని మొక్కలు విరిచి, ఆకులు కోసి వాటి రసం పిండి, తమ గాయాలకి పూసుకొన్నారు. వాళ్ళకి అంత తీవ్రంగా గాయాలు తగిలినా చెక్కు చెదరకుండా యెలా పరుగెత్తగలుగుతున్నారో సౌమ్యకర్థం కాలేదు. వీళ్ళు మనుషులా రాక్షస సంతతా అని అనుమానం వచ్చింది.

మరో పదినిమిషాల్లో దీపాలు కనిపించిన చోటికి చేరారు. అది మరో కోయగూడెంగా గుర్తించింది

సౌమ్య. దీపాలుగా దూరానికి కనిపించిన వెలుతురు కాగడాలది!

అక్కడ ఆరు బయట ప్రదేశంలో ఆడ మగ అందరు చేరి ఏదో పానీయం తాగుతున్నారు. తమ జాతివాళ్లు ఎవరో నాగరిక స్త్రీని మోసుకురావటం చూసి అందరు గోలగా అరుచుకుంటూ వాళ్ళని చుట్టుముట్టారు.

సౌమ్య కాగడాల వెలుర్లో వాళ్ళు చేస్తున్న పని స్పష్టంగా గుర్తించింది. వాళ్ళందరూ సారాయిలాంటి ద్రవాన్ని తాగుతున్నారు. ఆడ, మగ మత్తులో జోగుతున్నారు. మొగాళ్ళందరు గోచీలు మాత్రం ధరించారు. ఆడవాళ్ళు మొలచుట్టూ ఏదో ఆచ్ఛాదన కట్టుకున్నారు. శరీరమంతా దాదాపు నగ్నంగానే వున్నది.

సౌమ్య జుగుప్సతో, అసహ్యంతో కన్నులు మూసుకున్నది.

వీళ్ళిప్పుడు తనని ఏం చెయ్యబోతున్నారు? వీళ్ళు తనని యేదో చేసేలోపల తన ప్రాణంపోతే ఎంత బావుండును!

ఆటవికుల్లో నాయకుడిలా వున్న ఓ మనిషి తనని ఎత్తుకొచ్చిన వాళ్ళని ఏదో అడుగుతున్నాడు. వాళ్ళు తమ భాషలో యేదో చెప్తున్నారు. అది పూర్తిగా తనకి తెలియని భాష. వాళ్ళ హావభావాల్ని బట్టి అర్థం చేసుకోవాలే తప్ప వాళ్ళు ఏం మాట్లాడేది ఏమాత్రం అవగాహన కావటంలేదు.

ఆ నలుగురు ఆటవికులు చెప్పిన మాటలు విని ఆనందోత్సాహాలతో పెద్దగా చప్పట్లుచరుస్తూ తక్కిన వాళ్ళంతా నృత్యం చేయటం మొదలెట్టారు.

సౌమ్యని అక్కడే వున్న సగం నరికిన చెట్టు మొద్దుకు చేతులు వెనక్కి విరిచి కట్టేశారు. ఆమె నెత్తుకొచ్చిన

ఆటవికుల్ని మొగాళ్ళు తమ భుజాలమీదికెత్తుకొని అసందంగా కేకలు పెడుతూ నృత్యం చేయసాగారు. వాళ్ళకి కూడా సారాయిలాంటి ఆ ద్రవాన్ని నోట్లో పోస్తూ ఒంటినిండా దిమ్మరిస్తున్నారు. వికిలిగా నవ్వుతూ తుళ్ళుతూ గంతులు వేస్తున్నారు.

కొందరు ఆడవాళ్ళు సౌమ్యను కట్టేసిన చెట్టు దుంగ దగ్గరకొచ్చారు. వాళ్ళ చేతుల్లో సారాయి దొన్నె లున్నాయి. వెదురు బొంగుల్లో దాన్ని పోసి కిచకిచ లాడుతూ తాగుతూ ఆమె నోటి దగ్గరకు తెచ్చారు.

సౌమ్య అసహ్యంతో విసిరికొట్టింది. మరి కొందరు మళ్ళీ సౌమ్య నోటిదగ్గరకు ఆ పానీయాన్ని తీసుకొచ్చారు. వాళ్ళ భాషలో యేదో అడుగుతున్నారు. సౌమ్యకిదంతా చాలా వెసటగా, భరించలేనిదిగా వున్నది. కాని వాళ్ళు అనాగరికులు. రాక్షస స్వభావులు! వాళ్ళని వారించ బూనటం అవివేకం!

సౌమ్య విసిరికొట్టినా, విదిలించినా కూడా ఆడవాళ్ళు ఆమెచుట్టూ ముసుర్తూనే వున్నారు. కాగడాల వెలుగులో వాళ్ళు చేస్తున్న వికట నృత్యం మృత్యు దేవత చేసే కరాళ నృత్యంలా వుంది.

దాదాపు పూర్తి నగ్నంగా ఎగురుతున్న ఆ ఆడ వాళ్ళు పిశాచాలు గాల్లో తేలిపోతున్నట్టు. తన రక్తం పీల్చటానికి కోరలు సాచుకొని మీదపడుతున్నట్టు అనిపించారామెకు.

సౌమ్యకు పరిష్కారం స్ఫురించింది. వీళ్ళు తనని అవమానించి హింసించేలోగా వీళ్ళని రెచ్చగొట్టి తన ప్రాణం తీసేలా ప్రేరేపిస్తే మంచిది! తనకి ఈ నరక యాతన తప్పుతుంది. ఒక్కసారిగా విముక్తి దొరుకుతుంది.

ఆడవాళ్ళు తాగిన మైకంలో సౌమ్య ఒంటిమీదున్న చీరను లాగేశారు. ఆమె ఒంటిమీదున్న ఆచ్ఛాదనలు వాళ్ళకు వింతగా తోచాయి. ఒకటొకటే లాగటానికి సిద్ధపడ్డారు. తన పరువు మంటగలిసిపోయే క్షణం ఆసన్నమయిందని గ్రహించింది సౌమ్య. తన ఆలోచనను ఆచరణలో పెట్టింది!

తన గుడ్డలు పూర్తిగా శరీరంమీదినుంచి లాగెయ్యటానికి మళ్ళీ తనని సమీపించిన ఆడవాళ్ళని ఎగిరి గుండెలమీద తన్నింది సౌమ్య.

వాళ్ళు ఆమెనుంచి అటువంటి ప్రతిఘటన ఎదురుచూసి వుండకపోవటంవల్ల ఎగిరి అంతదూరంలో వెల్లకిలా పడ్డారు. ఆ మరుక్షణమే మహాకోపంతో పైకిలేచారు. పక్కన వెలుగుతున్న కాగడాలను అందుకొని ఆమెను కాల్చేయాలన్నంత ఉద్రేకంతో మీదికొచ్చారు.

సౌమ్య ఈసారి ఎగిరి వాళ్ళ మొహాలమీద తన్నింది. ఆ వేగానికి ఓ స్త్రీ చేతిలోని కాగడా ఎగిరి అల్లంత దూరంలో వున్న గుడిసెపైన పడింది.

అంతే! ఒక్కసారిగా మంటలు లేచాయి. ఒకదానినానుకొని మరో గుడిసె అంటుకొన్నది. రెల్లుగడ్డితో నేసిన గుడిసెలన్నీ భగ్గున మండసాగాయి.

అంతవరకు ఆనందంలో తాగిన మైకంలో వికృతంగా నాట్యం చేస్తున్న ఆటవికుల మత్తు వదిలిపోయింది. అందరు ఒక్కసారిగ మండిపోతున్న యిళ్ళను ఆర్పటానికి, అందులో నిద్రిస్తున్న తమ పసిపాపలని, వృద్ధులని రక్షించుకోవటంకోసం పరుగులు పెట్టారు.

జాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్న మంటల్లో సౌమ్య ముఖం ఎర్రగా వెలిగింది. దాదాపు అందరు ఆమె

విషయం మరిచిపోయి, ఒంటరిగా వదిలేశారు. సౌమ్య ఆ అవకాశాన్ని వదులుకోలేదు.

చేతులు రెండూ వెనక్కి విరిచి కట్టేయబడి వుండటం వల్ల నోటితో విప్పుకొనే అవకాశంలేదు. ఆమె అటు యిటు చూసింది. నేలమీద పడున్న కాగడా ఆమె సమస్యకు పరిష్కారం చూపించింది.

కాలితో కాగడానందుకొన్నది. అతికష్టం మీద, కాలిని మడచి వెనకవైపునుంచి నడుముదాకా కాగడాను పైకి లేపింది. ఒంటికాలిమీద బాలెన్స్ చేసుకుంటూ కాగడాను చేతికట్లమీదకు తీసుకొచ్చింది. బంధనాలు కాలిపోయాయి. అయితే ఆ ప్రయత్నంలో ఆమె చేతులు కూడా కాలాయి.

సౌమ్య చాలా వేగంగా పనిచేసింది. దూరంగా పడి వున్న తన చీరను అందుకొని ఒంటికి చుట్టుకున్నది. తన నెవరూ గమనించటంలేదని గ్రహించింది.

ఓసారి ముందుకు దృష్టి సారించింది. అందరు తమ తమ యిళ్ళని సంరక్షించుకొనే ప్రయత్నాల్లో నిమగ్నులై వున్నారు. ఇదే మంచి అదను! ఆమె వచ్చినదారి వెంబడే వెనక్కి పరుగుతీసింది.

తనని ఆటవికులు ఎత్తుకొచ్చినవైపే పరుగు పెడ్తున్నానని ఆమె అనుకొన్నది. కాని, తను పోతున్న దారి అడవిలోకి మరింత లోపలికి చొచ్చుకుపోతున్నదని ఆమె తెలుసుకునేసరికి చాలా ఆలస్యమయ్యింది.

దాదాపు ఓ ఏభైమంది ఆటవికులు తనకి అభిముఖంగా పరుగెత్తుకొని రావటం ఆమె గుర్తించింది. వాళ్ళు చాలా వేగంగా పరుగెత్తుకొస్తున్నారు. నలుగురైదుగురి చేతుల్లో కాగడాలు వెలుగుతున్నాయి!

ఆమె గుండె ఝల్లుమన్నది. తను తప్పించుకుపోవటం ఆటవికులు గమనించినట్టున్నారు. అందుకే తనని వెదుక్కుంటూ వస్తున్నారు. అగ్నిప్రమాదానికి కారకురాలైన తనని పట్టుకొని ఆ మంటల్లో పడేస్తారు. అనుమానంలేదు. తను అడవిలో ఏ చివరకు పరిగెత్తినా వాళ్ళకు దొరక్క తప్పదు!

సౌమ్య హతాశురాలయ్యింది. వాళ్ళకు దొరికి వాళ్ళ చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకొనే బదులు తనే ప్రాణాలు తీసేసుకుంటే....!?

ఆమెకు ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన రెండోసారి వచ్చింది. విరక్తిగా నవ్వుకున్నది. చావుకి, బతుక్కి మధ్యదూరం యింత తక్కువా? అంతకి కొద్ది నిమిషాల క్రితం చావాలనుకున్నది. మళ్ళీ బతకాలనిపించింది. కాని, యింతలోనే మరణం అనివార్యమని తేలిపోయింది.

సరిగ్గా అప్పుడే ఆమెకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఆటవికులు తనని వెనుకనుంచి తరుముకొని రావటానికి బదులు, తన ముందునుంచి యెలా వస్తున్నారు? బహుశా వేరేవాళ్ళేమో!

ఈ ఆలోచన రాగానే ఆమె గుబురుగా పెరిగిన ఓ చెట్టుపక్కకు తప్పుకొని, దారివైపు చూపు నిలిపింది. కాగడాల వెలుగు తనమీద పడితే ప్రమాదకరమని ఆమెకు తెలుసు. కాని, చెట్టు ఎక్కటానికి సమయం చాలదు. ఈలోపల వాళ్ళు తనకు ముఖాముఖి వచ్చేస్తారు.

కాగడాలు బాగా దగ్గరయ్యాయి. దూరం నుంచి యేభైమంది వుండొచ్చనుకొన్నదిగాని, అంతకన్న ఓ

పాతికమంది యెక్కడే వున్నారు. హుటాహుటిన పరుగు లాంటి నడకతో ఆరకలు పరుగులుగా సాగిపోతున్నారు. వాళ్ళు సౌమ్యకి స్పష్టంగా కనిపిస్తూన్నారు.

వాళ్ళు బాట వెంబడి సరాసరి వెళ్ళిపోయారు. వాళ్ళెవరు? ఆ అర్ధరాత్రి సమయంలో యెక్కడికి పోతున్నారు?

ఒక్కసారిగా అడివంతా ప్రకాశవంతంగా వెలిగి పోవటంతో సౌమ్యకు అదేమిటో వెంటనే అర్థంకాలేదు.

మెల్లిగా చెట్టెక్కి దృష్టిసారించింది!

ఆమె గుండెలు గుభిల్లుమన్నాయి! దూరంగా గుడిసెలు యింకా తగలబడుతునే వున్నాయి. అదికాదు ఆమె నాశ్చర్యపరచిన విషయం; అడవిలోని చెట్లుకూడా అగ్నితో రగులుకొంటున్నాయి. కార్చిచ్చు అడవినికూడా కాలుస్తోంది.

అప్పుడే తెలిసిందామెకు — తను గుడిసెలకు చాలా దూరం వచ్చేసిందిగాని, తను గతంలో ఆటవికులకు దొరికి పోయిన ప్రాంతానికి వ్యతిరేక దిశలో యింతసేపు ప్రయాణించి వచ్చేసింది. తనకి కనిపించిన ఆటవికులు గుడిసెల దగ్గరకు చేరుకున్నారప్పటికి!

వాళ్ళు వేరే గూడెంవాళ్ళు. గుడిసెలను ఆర్పడానికి ఆ గూడెం వాళ్ళకి సాయంగా వెళ్ళిన వారో గూడెపు కోయలు. అంటే యిక్కడ యిలాంటి గూడేలు లెక్కకుమించి వున్నట్టున్నాయి. వీళ్ళ దర్శి తప్పించుకొని వెళ్ళగలదా? నవీన్ని కలుసుకోగలదా?

నవీన్ గుర్తుకురాగానే ఆమె మనసంతా విషాదంతో నిండిపోయింది. తనకోసం, తనని రక్షించటంకోసం అనుక్షణం ప్రమాదాలతో చెలగాటాలాడుతూ, చివరికి

యేమయిపోయాడో కూడా తెలియకుండా మాయమయ్యాడు. ఈపాటికి ఆ లోయలోనుంచి బయటపడి వుంటాడా? తనకోసం వెతుక్కుంటున్నాడా?

ఆమె ఆలోచనలు చెదరగొడుతూ చెట్టుకింద ఎండుటాకులమీద పెద్దగా శబ్దమయ్యింది.

ఉలిక్కిపడింది సౌమ్య. నేలమీదికి కళ్ళుచిట్లించి చూసింది.

చీకట్లో మెరుస్తూన్న అగ్నిగోళాలవంటి కళ్ళు పైకి— తనవంకే చూస్తూన్నాయి. ఆ కళ్ళు తాలూకు క్రూర జంతువేమిటో గ్రహించేసరికి ఆమె గుండె వేగం హెచ్చింది. ఇదివరకట్లా ప్రతి ఆపదకు భయపడటం లేదిప్పుడు సౌమ్య. కాని ప్రమాదాల నెదుర్కొనే శక్తి నశించిపోతోంది!

ఓపక్క అడవంతా తగలబడిపోతోంది. మంట తను కూచున్న చెట్టుకు సమీపించటానికిక అట్టే సమయం పట్టదు. చెట్టు దిగి పారిపోవటానికి వీల్లేకుండా నేలమీద తనని వేటాడటానికి సిద్ధంగా కూచున్న చిరుతపులి!

సౌమ్య కర్తవ్యవిమూఢురాలిలాగా అలాగే చెట్టుపైన కూర్చుండిపోయింది.

* * *

విషకన్య, ఒక్కసారిగా పైకి లేచిన మంటల్ని చూసి విస్తుపోయింది.

అడవి అప్పుడప్పుడు తగలబడటం మామూలే! అదే జరుగుతోందా యిప్పుడు? అలా అయితే సౌమ్యని వెతకటం చాలా కష్టసాధ్య మవుతుంది. తన అనుచరులు నేలమీద ప్రాక్కొని వెళ్ళటం చాలా కష్టం!

నవీన్ ఆమె వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

“నా అనుమానం, కార్చిచ్చు పుట్టి అడవిని తగలబెడుతోందని! కొద్ది నిమిషాల్లో యీ విషయము తెలిసిపోతుంది!” అన్నది.

నవీన్‌లో టెన్షన్ పెరిగిపోతోంది. విషకన్యను అనుసరిస్తూన్నాడేగాని అతని ఆలోచనలన్నీ సౌమ్య చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

ఉగ్రనాగు, తదితర అనుచరులు ముందుకి మహావేగంగా సాగిపోతున్నాయి. వాటిననుసరిస్తున్నారు విషకన్య, నవీన్.

“ఆ దుండగులు సౌమ్యకేమీ అపకారం తలపెట్టలేదు కదా....” అన్నాడు నవీన్ అర్థోక్తిలోనే ఆపి, విషకన్యవైపు చూస్తూ.

“ఆమెకెలాంటి అపకారం జరగదు. ఈ ఆటవికులు నాగరికుల్లాగా స్త్రీమీద అత్యాచారం తలపెట్టరు. వీళ్ళకు సాటి మనుషులమీద అసూయాద్వేషాల్లేవు కాకపోతే, వీళ్ళలో మూర్ఖత్వం, మూఢనమ్మకాలు వేళ్ళు పాతుకుపోయి వున్నాయి. తమ మూర్ఖత్వానికి ఎప్పుడెవర్ని బలిచేస్తారో తెలీదు” అన్నది విషకన్య.

మరో పదిహేను నిమిషాల తర్వాత భగభగ మండిపోతున్న గూడెం సమీపించారు. ఉగ్రనాగు, తక్కిన నాగులు ఆగిపోయి విషకన్యవైపు తలతిప్పి చూశాయి.

విషకన్య అవి ఆగిన ప్రదేశం పరికించి చూసింది. అంతక్రితం సౌమ్యని బంధించి వుంచిన సగం నరికిన చెట్టు మొదలు, యింకా నేలమీద పడి వెలుగుతున్న కాగడా కనిపించాయక్కడ.

విషకన్య సాలోచనగా చూసింది నవీన్ వంక. నవీన్‌కి అప్పటికి పరిస్థితి అర్థమయింది. సౌమ్యని అక్కడ

బంధించి వుంటారని, ఈలోపల యేదో కారణంగా గుడి కిలు తెగలబడ్డాయని, వాళ్ళు వాటినార్పుకొనే ప్రయత్నాలో వున్నారని గ్రహించాడు. అయితే, సౌమ్య యేమయినట్టు?

విషకన్య ఉగ్రనాగువంక సాభిప్రాయంగా చూసింది. ఉగ్రనాగు అంతర్లీతం సౌమ్య పరుగెత్తి తప్పించుకొన్న కాలిబాటవైపు సాగిపోయింది.

విషకన్య నవీన్ వంక చూసి సైగ చేసింది. ఇద్దరు ఉగ్రనాగును అనుసరించారు.

అప్పటికి అడవిలోని చెట్లు యింకా మంటల్లో చిక్కుకోలేదు. కాని, వాళ్ళు ఓ ఫర్లాంగు దూరం వెళ్ళేసరికి కార్చిచ్చు రగులుకొన్నది. ముందుకి వెళ్ళటానికవకాశం లేకుండా నేల కారుగా వున్న మొక్కలు, పొదల్తో పాటు మంటల్లో చిక్కుకొన్నాయి.

ఉగ్రనాగు, తక్కిన నాగులు ముందుకి వెళ్ళే పాటి కాశం లేక ఆగిపోయాయి. విషకన్య వైపు నిస్సహాయంగా చూశాయి. విషకన్య తీవ్రంగా ఆలోచిస్తోంది. నవీన్‌లో టెన్షన్ మరింత పెరిగింది. మంటల్లో చిక్కుకుపోలేదు కదా సౌమ్య....అనుకొన్నాడు పదేపదే.

"మన ఉగ్రనాగు సూచనల్నిబట్టి సౌమ్య వీళ్ళనుంచి తప్పించుకొని ఇదే దారిన అడవి లోపలకు వెళ్ళిపోయింది. ఎక్కడో సురక్షితంగానే వుంటుంది. అయితే కార్చిచ్చు అడవిని దహించకముందే ఆమెను మనం ట్రేస్ చెయ్యగలిగితే మంచిది!" అన్నది విషకన్య.

కొద్ది క్షణాలసేపు రగుల్తున్న అడవికేసి, ఆకాశానికి

వాళ్ళు చూస్తూన్న మంటలకేసి చూస్తూ అలాగే నిల్చుండిపోయారు.

* * *

సౌమ్య కొమ్మలమధ్య అసహనంగా కదిలింది.

మంటలు తను కూచున్న చెట్టును సమీపించటానికి కొద్ది నిమిషాలు మాత్రమే వ్యవధ వున్నది. తను చెట్టు దిగటానికి వీల్లేకుండా నేలమీద చిరుతపులి తనవైపే కళ్ళప్పగించి చూస్తోంది.

చిరుతపులి చెట్టెక్కగలదని విన్నది తను. అదే జరిగితే తను ప్రాణాలమీద ఆశ వదిలేసుకోవచ్చు! ఆమె అసహనంగా చెట్టుమీద కొద్ది నిమిషాలు గడిపింది. మంటలు యింకా పెరగకముందే తను సురక్షితమైన ప్రదేశం చేరుకోవాలి! ఎలా?

నేలమీద కూచున్న చిరుతపులి అకస్మాత్తుగా లేచి నిల్చుంది. సౌమ్య గుండె కొట్టుకుంటున్న చప్పుడు ఆమెకే స్పష్టంగా వినిపిస్తోంది. ఒళ్ళంతా చెమటలు పట్టాయి. చెట్టెక్కుతుందా? తన జీవితం యిప్పటితో ముగిసిపోతుందా?

సౌమ్య గుండె దిటవు చేసుకొంది. ప్రాణభయంతో అనుక్షణం చచ్చేకన్నా ఒక్కసారి యీ చిరుతవాతపడి చావటం మేలు అనుకొన్నది!

అయితే, చిరుతపులి చెట్టెక్కే ప్రయత్నం చెయ్యలేదు.

అంతకంతకు మీదికొస్తూన్న మంటల్ని ఒక నిమిషం పరికించి చూసింది. ఆ తర్వాత ఒక్కసారిగా విల్లునుంచి విడిచిన బాణంలా ఎటో దూసుకొని వెళ్ళిపోయింది.

సౌమ్య కొద్దిక్షణాలవరకు ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు.

(సశేషం)